# అమ్మాయిల ధనాధన్ పోరు

**నేటి నుంచి అండర్-19 టీ20 ప్రపంచకప్ • టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి భారత్**



కౌలాలంపూర్: ఈ ఏడాది తొలి ఐసీసీ టోర్నీ అయిన మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌నకు శనివారంతో తెరలేవనుంది. రెండో ఎడిషన్‌గా జరుగబోయే ఈ మెగాటోర్నీకి కౌలాలంపూర్(మలేషియా) ఆతిథ్యమిస్తున్నది. 16 జట్లు పాల్గొంటున్న ఈ ప్రపంచకప్‌లో భారత్.. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగుతోంది. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 02 దాకా జరుగబోయే ఈ టోర్నీలో శనివారం ఆస్ట్రేలియా, స్కాట్లాండ్ మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. ఆదివారం వెస్టిండీస్ మ్యాచ్‌తో భారత్ టైటిల్ వేటను ఆరంభించనుంది.

**టైటిల్ నిలబెట్టుకునేనా?**

2023లో జరిగిన తొలి ఐసీసీ అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను షఫాలీ వర్మ సారథ్యంలోని టీమ్‌ఇండియా సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజా ఎడిషన్‌లో భారత్‌కు నికీ ప్రసాద్ సారథిగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ యువ క్రికెటర్లు గొంగడి త్రిష, కేసరి ధృతితో పాటు విశాఖపట్నం అమ్మాయి ఎండీ షబ్నమ్ భారత జట్టులో చోటు దక్కించుకున్నారు. గత కొన్నాళ్లుగా బ్యాటింగ్‌లో నిలకడగా ఆడుతూ జట్టులో చోటు దక్కించుకున్న త్రిష.. అంతర్జాతీయ స్థాయిలో మరోమారు సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. యువ బ్యాటర్లు, బౌలర్లతో సమతూకంగా ఉన్న టీమ్‌ఇండియా టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది.

| గ్రూప్ దశలో భారత్ మ్యాచ్‌లు | |
|---|---|
| జనవరి 19 | : వెస్టిండీస్‌తో |
| జనవరి 21 | : మలేషియాతో |
| జనవరి 25 | : శ్రీలంకతో |

**ఫార్మాట్ ఇలా..**

16 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి ఆడే ఈ టోర్నీ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. లీగ్ దశలో ఒక్కో గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్‌కు అర్హత సాధిస్తాయి. సూపర్ సిక్స్ దశలో ఒక్కో జట్టు ఇతర గ్రూప్‌లోని జట్లతో రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ దశలో టాప్-2లో నిలిచే 4 జట్లు సెమీస్‌కు వెళ్తాయి. జనవరి 31న రెండు సెమీస్ మ్యాచ్‌లు, ఫిబ్రవరి 02న ఫైనల్ జరుగనుంది.

# మెరిసిన క్రీడా రత్నాలు

**మను, హర్మన్, గుకేశ్, ప్రవీణ్‌కు ఖేల్‌రత్న**

**తెలంగాణ అథ్లెట్ దీప్తికి అర్జున అవార్డు**

**రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం**





ఢిల్లీ: పలు ప్రతిష్ఠాత్మక క్రీడాటోర్నీల్లో దేశ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన క్రీడాకారులకు సముచిత రీతిలో గౌరవం దక్కింది. పారిస్(2024) ఒలింపిక్స్‌లో పతకాలతో సత్తాచాటిన వారితో పాటు మెగాటోర్నీల్లో సత్తాచాటిన వారిని కేంద్ర క్రీడాశాఖ ఘనంగా సన్మానించింది. గతేడాదికి గాను కేంద్రం కొద్దిరోజుల క్రితం ప్రకటించిన క్రీడా పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమం ఇందుకు వేదికైంది. క్రీడారంగంలో అందజేసే అత్యున్నత పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును (ఈ ఏడాది నలుగురు క్రీడాకారులకు) స్టార్ షూటర్ మనూ భాకర్, చెస్ యువకెరటం దొమ్మరాజు గుకేశ్, హాకీ సారథి హర్మన్‌ప్రీత్ సింగ్, పారా హైజంపర్ ప్రవీణ్ కుమార్.. ముర్ము చేతుల మీదుగా పురస్కారాలను స్వీకరించారు. తెలంగాణ అమ్మాయి దీప్తి జివాంజీ, మరో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ అర్జున అవార్డులను అందుకున్నారు. అర్జున అవార్డు దక్కించుకున్న పలువురు పారా అథ్లెట్లు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# ఎదురులేని జొకో

- నాలుగో రౌండ్‌లోకి
- గాఫ్, సబలెంక దూకుడు
- గాయంతో ఒసాకా ఔట్
- ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: ప్రతిష్ఠాత్మక ఆస్ట్రేలియా ఓపెన్‌లో మాజీ చాంపియన్ నొవాక్ జొకోవిచ్, స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ జోరు కొనసాగిస్తున్నారు. శుక్రవారం జరిగిన వేర్వేరు మ్యాచ్‌లలో ఈ ఇద్దరూ తమ ప్రత్యర్థులను చిత్తుచేసి ఆస్ట్రేలియా ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరారు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న జొకో 6-1, 6-4, 6-4తో థామస్ మెకాచ్ (చెక్ రిపబ్లిక్)ను వరుస సెట్లలో చిత్తుచేసి నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించాడు. పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఈ సెర్బియా దిగ్గజం 9 ఏస్‌లు, 28 విన్నర్లు కొట్టాడు. మరో పోరులో మూడో సీడ్ అల్కరాజ్ 6-2, 6-4, 6-7 (3/7), 6-2తో బోర్గ్స్ (పోర్చ్‌గీస్)పై గెలిచాడు. సుమారు 3 గంటల పాటు సాగిన మ్యాచ్‌లో మూడో సెట్ కోల్పోయిన ఈ స్పెయిన్ కుర్రాడు నాలుగో సెట్‌లో పుంజుకుని మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో సీడ్ జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-3, 6-4, 6-4తో జాకబ్ ఫియర్న్లీ(బ్రిటన్)ను ఓడించగా హంబర్ట్ (ఫ్రాన్స్), లెహెక (చెక్) మూడో రౌండ్‌ను దాటారు.

**టైటిల్ వేటలో సబలెంక**

ఈ టోర్నీ హ్యాట్రిక్ టైటిల్ వేటలో ఉన్న టాప్ సీడ్ అరీనా సబలెంక.. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో 7-6 (7/5), 6-4తో క్లారా టోసన్ (డెన్మార్క్)ను ఓడించి నాలుగో రౌండ్‌లో ప్రవేశించింది. కోకో గాఫ్ (అమెరికా) 6-4, 6-2తో లైలా ఫెర్నాండెజ్ (కెనడా)పై అలవోక విజయం సాధించింది. జపాన్ ప్లేయర్ నవోమి ఒసాకా 6-7 (3/7) ఒక సెట్ ముగియగానే గాయంతో బాధపడటంతో ఆమె మ్యాచ్ నుంచి తప్పుకోగా, బెలిందా (స్విట్జర్లాండ్) ముందంజ వేసింది. ఏడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) 6-7 (3/7), 1-6తో అన్‌సీడెడ్ ఓల్గా (సెర్బియా) చేతిలో ఓటమిపాలైంది.

**బోపన్న ముందంజ**

భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. బోపన్న.. సుయ్ జంగ్ జోడీ 6-4, 6-4తో ఇవాన్ డొడిగ్-క్రిస్టినా జంటపై గెలిచింది.



## ఏషియన్ టోర్నీకి చికీత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ ఆర్చర్ తానిపర్తి చికీత సత్తాచాటింది. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరుపిస్తూ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలు కొల్లగొట్టిన చికీత తాజాగా ఏషియన్ జూనియర్ ఆర్చరీ టోర్నీకి ఎంపికైంది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక ఆర్చరీ ప్రపంచకప్‌నకు సెలెక్ట్ అయిన చికీత..ఏషియన్ సెలెక్షన్ ట్రయల్స్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచింది. కోల్‌కతా వేదికగా జాతీయ ఆర్చరీ అసోసియేషన్ నిర్వహించిన మహిళల కాంపౌండ్ విభాగం అర్హత పోటీల్లో పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈ యువ ఆర్చర్ 17.25 స్కోరుతో రెండో స్థానంలో నిలిచింది. ప్రతీకా ప్రదీప్(మహారాష్ట్ర) 17.75తో అగ్రస్థానంలో నిలిచింది. రానున్న ఏషియన్ టోర్నీతో పాటు ఆర్చరీ వరల్డ్‌కప్‌లో సత్తాచాటుతానని ఈ యువ ఆర్చర్ ధీమా వ్యక్తం చేసింది.

## రింకూసింగ్ వెడ్స్ ప్రియా!

**వార్తలు తోసిపుచ్చిన పెండ్లి కూతురు తండ్రి**



ముంబై: టీమ్‌ఇండియా డాషింగ్ బ్యాటర్ రింకూసింగ్ త్వరలో తన బ్యాచిలర్ జీవితానికి ఫుల్‌స్టాప్ పెట్టబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. టీమ్‌ఇండియా టీ20 జట్టులో సభ్యుడైన రింకూ..సమాజ్‌వాదీ లోక్‌సభ ఎంపీ ప్రియా సరోజ్‌ను పెండ్లి చేసుకోబోతున్నాడన్న వార్తలు ఒక్కసారిగా శుక్రవారం హల్‌చల్ చేశాయి. తన దూకుడైన బ్యాటింగ్‌తో అనతి కాలంలోనే జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న రింకూ కుటుంబ సభ్యుల నుంచి పెండ్లి ప్రతిపాదన వచ్చినట్లు ప్రియా సరోజ్ తండ్రి తుఫానీ సరోజ్ పేర్కొన్నారు. అయితే పెండ్లిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశాడు. ఇద్దరి నిశ్చితార్థంపై వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశాడు.

## కర్నాటక X విదర్భ

- నేడు విజయ్ హజారే ఫైనల్

వడోదర: దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక విజయ్ హజారే ట్రోఫీ టైటిల్ పోరుకు వేళైంది. సీజన్ ఆసాంతం అత్యుత్తమ ప్రదర్శనలతో ఫైనల్ చేరిన కర్నాటక, విదర్భ తుది పోరులో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ సీజన్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న విదర్భ సారథి కరుణ్ నాయర్‌ను అడ్డుకోకుంటే కర్నాటకకు తిప్పలు తప్పవు. ఈ టోర్నీలో ఇప్పటికే అతడు 752 పరుగులతో దూకుడుమీదున్నాడు. గత ఏడు ఇన్నింగ్స్‌లలో అతడు ఏకంగా ఐదు శతకాలు, ఒక అర్ధ సెంచరీతో జోరు కొనసాగిస్తున్నాడు. నాయర్‌తో పాటు ఓపెనర్లు యశ్ రాథోడ్, ధ్రువ్ షోరే, వికెట్ కీపర్ జితేశ్ శర్మ మంచి ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు పడిక్కల్, మయాంక్, రవిచంద్రన్, వంటి బ్యాటర్లతో కర్నాటక బ్యాటింగ్ విభాగం బలంగానే ఉంది.

## ఢిల్లీ రంజీ జట్టులో కోహ్లీ..!

ఢిల్లీ: కొంతకాలంగా పేలవ బ్యాటింగ్‌తో సతమతమవుతూ తీవ్ర విమర్శలు ఎదుర్కుంటున్న విరాట్ కోహ్లీ.. దేశవాళీలో ఆడాలని మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు డిమాండ్లు చేస్తున్న విషయం తెలిసిందే. 2012 నుంచి కోహ్లీ దేశవాళీలో ఆడలేదు. కాగా తాజాగా కోహ్లీ పేరును 22 మంది సభ్యులతో కూడిన ఢిల్లీ రంజీ జట్టులో చేర్చినా అతడు దానిని వినియోగించుకునే అవకాశాలు తక్కువేఉన్నాయి. సిడ్నీ టెస్టు సమయంలో తన మెడ నరాలు పట్టేయడంతో ప్రస్తుతం అందుకు చికిత్స తీసుకుంటున్నానని, రంజీ మ్యాచ్ ఆడలేనని డీడీసీఏకు కోహ్లీ తెలిపినట్టు సమాచారం.

## సెమీస్‌లో సాత్విక్ జోడీ

**సింధు, కిరణ్ నిష్క్రమణ**



ఢిల్లీ: స్వదేశంలో జరుగుతున్న ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్ విభాగాల్లో భారత ఆశలు మోస్తున్న పీవీ సింధు, కిరణ్ జార్జి పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్-చిరాగ్ ద్వయం తమ జోరును కొనసాగిస్తూ సెమీస్‌కు దూసుకెళ్లగా సింధు, జార్జి ఓటములు పాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. ఏకంగా 21 మందితో ఈ టోర్నీ బరిలోకి దిగిన భారత్ తరపున ఇక మిగిలింది సాత్విక్ జోడీనే కావడం గమనార్హం. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్ పోరులో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-10, 21-17తో జిన్ యంగ్-కంగ్ మిన్ హ్యుక్ (దక్షిణ కొరియా) జంటను చిత్తుచేసింది. పెండ్లి తర్వాత తొలి టోర్నీ ఆడుతున్న సింధు 9-21, 21-19, 17-21తో జార్జియానా మరిస్క (ఇండోనేషియా) చేతిలో పోరాడి ఓడింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి 13-21, 19-21తో వెంగ్ హాంగ్‌యంగ్ (చైనా)కు తలవంచాడు.

## వాణిజ్య

### 'నామినీలు తప్పనిసరి'

ముంబై, జనవరి 17: బ్యాంక్ ఖాతాలతోపాటు డిపాజిట్ ఖాతాలు, లాకర్లు ఇక నుంచి కచ్చితంగా నామినీలు తప్పనిసరి చేయాలని బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ తాజాగా ఆదేశించింది. దేశవ్యాప్తంగా అత్యధిక స్థాయిలో బ్యాంక్ ఖాతాలకు నామినీలు లేరని, వెంటనే పాత, కొత్త ఖాతాలకు కచ్చితంగా నామినీ ఉండాల్సిందేనని శుక్రవారం ఆదేశించింది. డిపాజిటర్ మరణించిన వారి కుటుంబీలకు ఆయా డిపాజిట్లను సమర్పించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ సమస్య రాకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో చాలా డిపాజిట్ ఖాతాలకు నామినీలు లేరని సెంట్రల్ బ్యాంక్ గుర్తించింది. మరోవైపు, బ్యాంక్ ఖాతాకు సంబంధించి లావాదేవీలకోసం '1600ఎక్స్‌ఎక్స్' ఫోన్ నంబర్‌ను వినియోగించుకోవాలని బ్యాంకులకు సెంట్రల్ బ్యాంక్ సూచించింది. ఆర్థిక మోసాలను నియంత్రించడానికి ఈ సరికొత్త నంబర్‌ను ప్రవేశపెట్టింది ఆర్బీఐ. అలాగే ప్రమోషనల్ కోసం బ్యాంకులు, ఇతర రెగ్యులేటెడ్ సంస్థలు 140ఎక్స్‌ఎక్స్ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించింది.

### విప్రోలో 12 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ విప్రో భారీ స్థాయిలో ఫ్రెషర్లను నియమించుకోవడానికి సిద్ధమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 10-12 వేల మంది ఫ్రెషర్లను రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించింది. గడిచిన రెండు త్రైమాసికాలుగా భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థ..మూడో త్రైమాసికంలో 1,157 మంది సిబ్బంది తగ్గారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,32,732కి పరిమితమైనట్లు ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రతి త్రైమాసికంలో 2,500-3,000 మంది ఫ్రెషర్లు ఆన్‌బోర్డ్‌లో ఉంటున్నారని కంపెనీ మానవ వనరుల ప్రతినిధి సౌరబ్ గోవిల్ తెలిపారు. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,354 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 24.4 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం స్వల్పంగా పెరిగి రూ.22,319 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

# ఆటో షో అదుర్స్

**సరికొత్త మాడళ్లతో అబ్బురపరిచిన ఆటో రంగ సంస్థలు • అట్టహాసంగా మొదలైన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025**

**ఏకంగా 32 వాహనాలను ప్రదర్శించిన టాటా • ఎలక్ట్రిక్ విటారా, క్రెటాలను పరిచయం చేసిన మారుతీ, హ్యుందాయ్**

**నయా టూవీలర్లతో హీరో, సుజుకీ, హోండా, బజాజ్, టీవీఎస్‌లు • ఈవీలతో అదరగొట్టిన బెంజ్, బీఎండబ్ల్యూ, పోర్షే**




మెర్సిడెజ్ బెంజ్ కాన్సెప్ట్ సీఎల్ఏ క్లాస్



బీఎండబ్ల్యూ ఎక్స్1 ఈవీ



హ్యుందాయ్ క్రెటా ఈవీ



టీవీఎస్ జూపిటర్ సీఎన్జీ



హీరో ఎక్స్‌ట్రీమ్ 250ఆర్, ఎక్స్‌పల్స్ 210




టాటా మోటార్స్ సియెర్రా ఐసీఈ




ఎంజీ మోటార్ సైబర్‌స్టర్



మారుతి ఈ-విటారా



హోండా యాక్టివా ఈవీ




కియా ఈవీ 6



పోర్షే 911 జీటీ3 ఆర్ఎస్



బజాజ్ ఫ్రీడమ్ 125 సీఎన్జీ



టాటా హారియర్ ఈవీ



సుజుకీ గిక్సర్, యాక్సెస్ ఎలక్ట్రిక్ స్కూటర్లు

న్యూఢిల్లీ, జనవరి 17: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 శుక్రవారం ఇక్కడి భారత్ మండపంలో ఘనంగా మొదలైంది. తొలిరోజు విద్యుత్తు ఆధారిత (ఈవీ) వాహనాలదే పైచేయిగా నిలిచింది. ద్విచక్ర వాహన తయారీ సంస్థల దగ్గర్నుంచి మీడియం, లగ్జరీ లెవల్ కార్ల కంపెనీలన్నీ ఎలక్ట్రిక్ వెహికిల్స్‌ను పరిచయం చేశాయి మరి. ఇక దేశీయ ఆటో రంగ దిగ్గజ సంస్థ టాటా మోటర్స్ ఏకంగా 32 రకాల కమర్షియల్, ప్యాసింజర్ వెహికిల్స్‌ను ప్రదర్శించడం గమనార్హం. అలాగే వాహన ప్రియులను ఎప్పట్నుంచో ఊరిస్తున్న క్రెటా ఈవీ మాడల్‌ను హ్యుందాయ్ దేశంలోకి తీసుకురాగా, బ్యాటరీ ఎలక్ట్రిక్ విటారాతో ఈవీ సెగ్మెంట్‌లోకి మారుతీ అడుగుపెట్టింది. గ్రీవ్ కాటన్ గ్లైబర్, ఎక్స్‌ప్రెస్ వాహనాలతోపాటు, ఈ-మోటర్‌సైకిల్‌ను ఆవిష్కరించింది. సుజుకీ తమ తొలి ఈ-స్కూటర్ యాక్సెస్‌ను ప్రదర్శించింది. ఈ నెల 22దాకా ఈ ఎక్స్‌పో జరుగనున్నది.

### ఆటో ఎక్స్‌పో హైలైట్స్

- టాటా మోటర్స్ ఈ ఒక్కరోజే 32 కొత్త రకాల ప్యాసింజర్, కమర్షియల్ వాహనాలను ప్రదర్శించింది.
- ప్యాసింజర్ వాహన విభాగంలో 18 కార్లు, ఎస్‌యూవీలు.. కమర్షియల్ సెగ్మెంట్‌లో 14 వాహనాల్ని తెచ్చిన టాటా.
- అప్‌డేట్ వెర్షన్‌లో 90లనాటి సియెర్రా కారును ఆవిష్కరించిన టాటా మోటర్స్.
- 7 రకాల మాడల్స్‌ను ఆవిష్కరించిన మెర్సిడెజ్ బెంజ్.
- ఎస్‌యూవీ మకాన్, అప్‌డేటెడ్ టైకన్ స్పోర్ట్ సలూన్ కార్లను తీసుకొచ్చిన పోర్షే.
- ఒక్కసారి చార్జ్ చేస్తే 500 కిలోమీటర్లదాకా ప్రయాణించనున్న మారుతీ ఈ-విటారా.
- పక్షి రెక్కల తరహాలో తెరుచుకునే డోర్లతో ఎంజీ సైబర్‌స్టర్ కారు.
- 4 రకాల బైకులు, స్కూటర్లను పరిచయం చేసిన హీరో.
- 2027-28లో దేశీయ మార్కెట్‌కు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ట్రక్కులు, బస్సులు, కార్లు పరిచయం.
- ఈ ఏడాది ఆగస్టులో సియెర్రా ఈవీ మాడల్‌ను రూ.25 లక్షల ధరతో మార్కెట్‌కు టాటా మోటర్స్ పరిచయం చేసే వీలున్నది.
- వచ్చే ఏడాది జూన్‌లో టాటా అవిన్య మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశం.
- త్వరలో మరిన్ని కొత్త మాడళ్లను తీసుకొస్తామన్న జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్స్.
- ఐకానిక్ ఆర్‌ఎక్స్ 100, ఆర్‌డీ 350 మాడళ్లను ప్రదర్శించిన యమహా మోటర్స్.
- ఆటో షోలో యమహా ఏఐ కాన్సెప్ట్ బైక్‌తోపాటు మరో 9 రకాల బైక్ మాడల్స్ ప్రదర్శన.
- సీఎన్జీ బైక్, స్కూటర్లను ఆవిష్కరించిన బజాజ్, టీవీఎస్‌లు.

### తొలిరోజు ఆవిష్కరణలివే..

| సంస్థ | కార్లు/బైకులు | అంచనా ధర (రూ.లలో) |
|---|---|---|
| మారుతీ | ఈ-విటారా | 22-25 లక్షలు |
| హ్యుందాయ్ | క్రెటా ఎలక్ట్రిక్ | 18-24 లక్షలు |
| టాటా మోటర్స్ | హరియర్.ఈవీ | 30 లక్షలు |
| | అవిన్య ఎక్స్ లగ్జరీ ఈవీ | 30 లక్షలు |
| | సియెర్రా ఐసీఈ | 11 లక్షలు |
| | ఇంట్రా ఈవీ పికప్ | 9 లక్షలు |
| మెర్సిడెజ్ బెంజ్ | ఈక్యూఎస్ మేబ్యాచ్ ఎస్‌యూవీ 680 | 2.63 కోట్లు |
| | మేబ్యాచ్ జీఎల్ఎస్ 600 | 3.71 కోట్లు |
| | కాన్సెప్ట్ సీఎల్ఏ క్లాస్ | ---- |
| | జీ 580 | ---- |
| | ఈ-క్లాస్ 450 4మ్యాటిక్ | ---- |
| | ఏఎంజీ ఎస్ఎల్ 55 4మ్యాటిక్‌ప్లస్ | ---- |
| | ఏఎంజీ ఎస్ 63 ఈ పెర్ఫార్మెన్స్ | ---- |
| బీఎండబ్ల్యూ | ఎక్స్1 లాంగ్ వీల్‌బేస్ ఈవీ | 49 లక్షలు |
| | ఐ7 | 2-5 కోట్లు |
| మినీ | కంట్రీమ్యాన్ ఈవీ | 55 లక్షలు |
| | కూపర్ ఎస్ | 45-53 లక్షలు |
| స్కోడా | ఆక్టేవియా ఆర్ఎస్ | ---- |
| | కైలాక్ | 8-15 లక్షలు |
| ఎంజీ మోటర్ | సైబర్‌స్టర్ | 60-70 లక్షలు |
| పోర్షే | 911 జీటీ3 ఆర్ఎస్ | 4.32 కోట్లు |
| హీరో మోటో కార్ప్ | ఎక్స్‌ట్రీమ్ 250ఆర్ | 1.80 లక్షలు |
| | ఎక్స్‌పల్స్ 210 | 1.76 లక్షలు |
| | గ్లామ్ 160 | 1.48 లక్షలు |
| | గ్లామ్ 125 | 86,900 |
| సుజుకీ | గిక్సర్ ఎస్ఎఫ్ 250 ఎఫ్ఎఫ్ | 2.17 లక్షలు |
| | ఈ-యాక్సెస్ ఎలక్ట్రిక్ | 1-1.20 లక్షలు |
| | యాక్సెస్ 125 కొత్త వెర్షన్ | 81,700 |
| కియా | సరికొత్త ఈవీ6 ఫేస్‌లిఫ్ట్ | 61-66 లక్షలు |
| బజాజ్ | ఫ్రీడమ్ 125 సీఎన్జీ | 1.10 లక్షలు |
| టీవీఎస్ | జూపిటర్ సీఎన్జీ | 1.10 లక్షలు |
| హోండా | యాక్టీవా ఎలక్ట్రిక్ | 1.17 లక్షలు |
| | క్యూసీ1 ఎలక్ట్రిక్ | 90,000 |

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.